అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు

ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం అధిక స్థాయిలో దెబ్బతిన్నది. శిలాజ ఇంధనాల వాడకం, జనాభా పెరుగుదల, అడవుల నరికివేత, డ్యామ్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం వివరీతంగా పెరిగిపోవడం, వ్యవసాయ విస్తరణ, నేల స్వాదుజల, సముద్ర జలవనరుల అధిక దుర్వినియోగం లాంటివి దీనికి ప్రధాన కారణాలు. ప్రపంచంలో అధిక దేశాలను పీడిస్తున్న ప్రధాన సమస్య– సహజవనరుల కొరత. ఘన, హానికర (Hazardous) వ్యర్థ పదార్థాల వాడకం పర్యావరణం లోని వివిధ భాగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ప్రపంచ దేశాలు ఈ సమస్యలను గుర్తించి ఎన్నో అంతర్జాతీయ ఒప్పందాలను అమల్లోకి తీసుకొచ్చాయి. వీటిలో అనేక ఒప్పందాలు ఐక్యరాజ్యసమితి చొరవతో రూపుదిద్దుకుని అమల్లోకి వచ్చినవే. వివిధ పోటీ పరీక్షల్లో ఈ అంశంపై క్రమం తప్పకుండా ప్రశ్నలు వస్తున్నాయి. ఒప్పందం ఏమిటి? దీని ఉద్దేశం? ఎప్పుడు అమల్లోకి వచ్చింది? అనే వివరాలను గుర్తుంచుకోవాలి.

• United Nations Frame work Convention on Climate Charge (UNFCCC)

1992లో జూన్ 3–14 మధ్య రియోడిజనైరోలో జరిగిన యునైటెడ్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ (UNCED) లేదా ఎర్త్ సమిట్‌లో ఈ ఒప్పందం రూపుదిద్దుకుంది. ప్రపంచ శీతోష్ణ మార్పులపై అవాంఛనీయ ప్రభావం సంభవించని స్థాయికి గ్రీన్‌హౌస్ వాయువులు (CO_2, CH_4, N_2O) మొదలైన ఉద్గారాలను నియంత్రించాలన్నది ఈ కన్వెన్షన్ ముఖ్య ఉద్దేశం. ఈ ఒప్పందంలో భాగంగానే క్యోటో ప్రోటోకాల్ అమల్లోకి వచ్చింది. UNFCCCలో మొత్తం 192 సభ్యదేశాలు ఉన్నాయి. మార్చి 21, 1994 నుంచి UNFCCC అమల్లో ఉంది. 1995 నుంచి 2008 వరకు ఈ కన్వెన్షన్ సభ్యదేశాల సదస్సులు Conference of Parties (COP) మొత్తం 14 జరిగాయి. ఈ ఏడాది డిసెంబర్ 7–18 మధ్య కొపెన్‌హెగన్(డెన్మార్క్)లో COP-15 సదస్సు జరగనుంది. 2012 తర్వాత క్యోటో ప్రోటోకాల్‌కు ప్రత్యామ్నాయ ఒప్పందం రూప కల్పన ఈ సదస్సులో జరగనుంది.

• క్యోటో ప్రోటోకాల్:

UNFCCCలో భాగంగా ఏర్పడిన అంతర్జాతీయ ఒప్పందం. 1997 డిసెంబర్‌లో జపాన్‌లోని క్యోటో నగరంలో దీన్ని రూపొందించారు. కార్బన్‌డైఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్, సల్ఫర్ హెక్సా ఫ్లోరైడ్, పర్‌ఫ్లోరో కార్బన్స్, హైడ్రాఫ్లోరో కార్బన్లు లాంటి ఆరు రకాల గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను ఈ ఒప్పందం ద్వారా నియంత్రిస్తారు. ఫిబ్రవరి 16, 2005 ఇది అమల్లోకి వచ్చింది. జనవరి 2009 నాటికి మొత్తం 183 దేశాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం పారిశ్రామిక దేశాలు 2012 కల్లా తమ గ్రీన్‌హౌస్ ఉద్గారాలను 1990 నాటి స్థాయిలో 5.2 శాతానికి తగ్గించాలి. 2012 నాటికి దీని జీవితకాలం ముగుస్తుంది. ఆ తర్వాతే అవలంభించాల్సిన ఒప్పందం తీర్మానం కోసం ఈ ఏడాది డిసెంబర్‌లో డెన్మార్క్‌లోని కొపెన్‌హెగన్ 15వ క్లైమేట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ జరగనుంది.

• మాంట్రియాల్ ప్రోటోకాల్:

స్ట్రాటోస్ఫియర్‌లోని ఓజోన్ పొరను దెబ్బతీసే హానికర పదార్థాల విడుదలను నియంత్రించే లక్ష్యంతో ఏర్పడిన అంతర్జాతీయ ఒప్పందం. హానికర అల్ప తరంగ దైర్ఘ్య అతినీలలోహిత కిరణాలు ట్రోపోస్ఫియర్‌లోకి రాకుండా స్ట్రాటోస్ఫియర్‌లోని ఓజోన్ పొర, అడ్డుకుంటుంది. క్లోరో ఫ్లోరోకార్బన్స్, హైడ్రో క్లోరో ఫ్లోరోకార్బన్, హాలోన్స్ వంటి Ozone Depleting Subst- ances (ODS) ఈ ఒప్పందంలో భాగంగా పూర్తిగా నిషేధిస్తారు. 1987లో దీని తీర్మానం ప్రారంభమై జనవరి 1, 1989న అమల్లోకి వచ్చింది. మాంట్రియాల్ ప్రోటోకాల్‌లోని అన్ని అంశాలకు కట్టుబడి ఉంటే 2050 నాటికి ఓజోన్ పొర ఏర్పడే అవకాశం ఉంది.

• రామ్‌సర్ కన్వెన్షన్:

చిత్తడి నేలల సంరక్షణ కోసం ఏర్పడిన అంతర్జాతీయ ఒప్పందం. ఇరాన్‌లోని రామ్‌సర్ నగరంలో ఫిబ్రవరి 2, 1971న ఈ ఒప్పందాన్ని రూపొందిం చారు. 1975 డిసెంబర్ 21న ఇది అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా చిత్తడి నేలల సంరక్షణ కోసం ఇప్పటికీ 1847 ప్రాంతాలను గుర్తించారు. 18.1 లక్షల చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఈ చిత్తడి నేలలు వ్యాపించి ఉన్నాయి. చిత్తడి నేలలకు అధిక జీవావరణ విలువ ఉంది.

• కన్వెన్షన్ ఆన్ బయలాజికల్ డైవర్సిటీ (CBD):

ప్రపంచవ్యాప్తంగా జీవ వైవిధ్య సంరక్షణ కోసం ఏర్పాటైన అంతర్జాతీయ ఒప్పందం. డిసెంబర్ 29, 1993న ఇది అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యాలు–

- జీవ వైవిధ్య సంరక్షణ
- జీవ వైవిధ్యాన్ని సుస్థిర రీతిలో వినియోగించడం
- జన్యు వనరుల వాడకం ద్వారా పొందిన లాభాలను అందరూ సమానంగా పంచు కోవడం.

• కార్టజినా ప్రోటోకోల్ ఆన్ బయోసేఫ్టీ: దీన్ని 'Biosafety Protocol' అని కూడా అంటారు. ఈ ఒప్పందం 2003 సెప్టెంబర్ 11న అమల్లోకి వచ్చింది. నూతన టెక్నాలజీ ద్వారా అభివృద్ధి చెందే పదార్థాలు మనుషులపై ప్రభావం ఉండని విధంగా చేయాలన్నది ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.

ఉదాహరణ: జన్యుమార్పిడి పంట ఉత్పత్తులు హానికరమైనవని రుజువైతే వెంటనే వాటి సాగుని నిషేధించాలని ఈ ఒప్పందం పేర్కొంది.

- **Convention on International Trade in Endangered Species of Wild Fauna and Flora (CITES)-**

దీన్ని వాషింగ్‌టన్ కన్వెన్షన్ అని కూడా అంటారు. అంతరించిపోయే ప్రమాదమున్న జంతు వృక్ష జాతుల భాగాల వ్యాపారాన్ని, వాణిజ్యాన్ని ఈ ఒప్పందం నిషేధించింది. దాదాపు 33 వేల జాతుల జంతువులు, మొక్కలకు ఈ ఒప్పందంలో భాగంగా సంరక్షణ లభించింది. ఇది జూలై 1, 1975లో అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 1, 2009 వరకు ఇందులో 175 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి.

- **Convention on Prevention of Marine Pollution by Dumping of Water and other matter**

దీన్ని లండన్ కన్వెన్షన్ అంటారు. సముద్రంలో వ్యర్థ పదార్థాల విడుదలను నివారించడానికి ఏర్పడిన అంతర్జాతీయ ఒప్పందం ఇది. జూన్ 1972లో స్టాక్‌హోంలో జరిగిన ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సులో ఈ రకమైన ఒప్పందం ఆవశ్యకతను గుర్తించారు. 1972, నవంబర్ 13న లండన్‌లో దీన్ని రూపొందించారు. 1975 ఆగస్టు 30న ఇది అమల్లోకి వచ్చింది.

- **International Convention for the Regulation of Whaling**

తిమింగలాలు, డాల్ఫిన్‌ల వేటను whaling అంటారు. వేలింగ్‌ను నియంత్రించే అంతర్జాతీయ ఒప్పందం ఇది. నార్వే, జపాన్, ఫిన్‌లాండ్ దేశాలతో పాటు స్కాట్‌ల్యాండ్‌కు సమీపంలో ఫరో దీవుల్లో వేలింగ్‌ను విపరీతంగా చేపడుతున్నారు. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (WWF-N) ప్రకారం ఏటా 60 వేలకు పైగా ఈ జంతువులు వేటకు గుర వుతున్నాయి. 59 దేశాల్లో వేలింగ్‌ను నియంత్రించేందుకు ఈ ఒప్పందం ఏర్పడింది. నవంబర్ 10, 1948న ఇది అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ఆధారంగా ఒక International Whaling Commission కూడా ఏర్పాటైంది.

- **Convention on Conservation of Migratory Species of Wild Animals:**

దీన్ని CMS లేదా బాన్ కన్వెన్షన్ అంటారు. (ఇది బాన్ అగ్రిమెంట్ కాదు) నేల, నీరు, గాలి ద్వారా వలస చెందే అనేక వలస జంతువుల సంరక్షణ నిమిత్తం ఏర్పడిన సంస్థ. అంతరించే ప్రమాదమున్న వలస జంతువులను ఈ ఒప్పందంలో భాగంగా గుర్తిస్తారు. 1983 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. సముద్ర తాబేళ్లు (Turtles) సైబీరియన్ క్రేన్, ఐరోపా బట్టమేక పక్షి, సముద్ర ఆవు (డ్యుగాంగ్), నీటి వార్‌బ్లర్ వంటి జంతువుల సంరక్షణ చర్యలు ఈ ఒప్పందంలో పేర్కొన్నారు.

- **United Nations Convention to Combat Desertification (UNCCD)**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కరవు ఎడారీకరణను నియంత్రించి, నిరోధించడానికి ఉద్దేశించిన ఒప్పందం ఇది. డిసెంబర్ 1996లో అమల్లోకి వచ్చింది. 193 సభ్యదేశాలు ఉన్నాయి. ఈ ఒప్పందంపై అవగాహనను పెంపొందించడానికి 2006ను 'International year of Deserts and Desertification'గా ప్రకటించారు.

మాదిరి ప్రశ్నలు

1. 2008లో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్-14 లేదా 14వ ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు ఏ నగరంలో జరిగింది?
   ఎ) బాలి బి) న్యూఢిల్లీ
   సి) మాంట్రియాల్ డి) పోజ్‌నాన్
2. ఐక్యరాజ్యసమితికి ఆధ్వర్యంలో ఏర్పడిన ఇంటర్-గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ (IPCC) శీతోష్ణస్థితి మార్పులపై ఎప్పుడు నివేదికను సమర్పించింది?
   ఎ) 2006 బి) 2007 సి) 2008 డి) 2009
3. అత్యధిక చిత్తడి నేలలు ఉన్న దేశం?
   ఎ) భారత్ బి) బ్రిటన్ సి) కెనడా డి) ఫ్రాన్స్
4. ఒక భౌగోళిక ప్రాంతంలోని విస్తరించి ఉన్న వన్య జంతువులను ఏమంటారు?
   ఎ) ఫ్లోరా బి) ఫానా
   సి) ప్లాంక్టాన్ డి) న్యూస్టాన్
5. యుద్ధాల్లో రసాయన, జీవ ఆయుధాల వాడకాన్ని నిరోధించేందుకు ఏర్పడిన అంతర్జాతీయ ఒప్పందం?
   ఎ) జెనీవా ప్రోటోకాల్ బి) రాటర్‌డాం కన్వెన్షన్
   సి) కార్టజినా ప్రోటోకాల్ డి) ఏదీ కాదు

సమాధానాలు

1	డి	2	బి	3	బి	4	బి	5	ఎ